క్లుప్తంగా

పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో శోభారాణి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. పారిశుధ్య పనులను సక్రమంగా చేసి గ్రామాల్లో ప్రజలను రోగాల బారి నుంచి కాపాడాలన్నారు. పంచాయతీలకు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా వాటర్ ట్యాంకులు, ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయించి ప్రజలకు మంచినీరు అందించాలన్నారు. పంచాయతీల్లో నిర్మాణాల్లో ఉన్న రోడ్లు, భవనాల పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ మురళీ బాపూజీ పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

చీరాల టౌన్: దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అప్రమత్తంగా ఉండటం ద్వారా వ్యాధులబారిన పడకుండా ఉంటారని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శ్రీదేవి సూచించారు. దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ జనావాసాల మధ్య మురుగునీటి కుంటలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమైనా వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతి కుటుంబం దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సమాచార హక్కు చట్టంపై అవగాహన

చీరాల రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11 గంటలకు సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి సుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు చట్టం, పౌర సమాచార కమిషన్ ఉత్తర్వుల ప్రకారం బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం -2005పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని అధికారులు, సిబ్బంది, గ్రామ స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఇళ్ల మధ్య మురుగు తొలగించాలని ధర్నా

చీరాల: తమ ఇళ్ల వద్ద ఉన్న మురుగునీరు తొలగించాలని కోరుతూ పట్టణంలోని 31వ వార్డు రోశయ్యకాలనీ ప్రజలు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకుడు ఎన్.బాబూరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తికి వినతిపత్రం అందించారు.

కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

చీరాల రూరల్: న్యాయవాదులకు సంబంధించి సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సీవోపీ)పై బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ విడుదల చేసిన జీవోలోని కొన్ని అంశాలను నిరసిస్తూ న్యాయవాదులు సోమవారం తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, సెక్రటరీ ఉదయభాస్కరరావు మాట్లాడుతూ న్యాయవాది పదో తరగతి నుంచి ఎడ్యుకేషన్ పూర్తయ్యే వరకు చదివిన అన్ని సర్టిఫికెట్లు, మార్కుల లిస్టులు జతచేసి బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు పంపించాలని జీవోలో పొందుపరచడం అన్యాయమని అన్నారు. తక్షణమే జీవోను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

పాఠశాల నిర్వహణపై జాగ్రత్తలు అవసరం

స్వర్ణపాలెం (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై ఉపాధ్యాయులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. మండలంలోని స్వర్ణపాలెం ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. పాఠశాలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను ఆయన పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనివేళల్లో, బోధనా విధానంలో, భోజనాలు వడ్డించే క్రమంలో ఆయన పలు జాగ్రత్తలు చెప్పారు. రికార్డుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఏ ఉమామహేశ్వరరావుతో కలసి విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేశారు. కేబిజక్ మాస్టారు అందించిన రాత పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరశింహారెడ్డి, పీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



కొరిశపాడు రిజర్వాయర్



కుందేరు ఆధునికీకరణ చేస్తున్న దృశ్యం (ఫైల్)



వాడరేవు ఫిషింగ్ హార్బర్ నమూనా

సమస్యలపై గళమెత్తండి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యల సాధన కోసం ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళమెత్తి నిధులు సాధించాల్సిన అవసరం ఉంది. సాగు, తాగునీటి వనరులను మెరుగుపరచడంతో పాటు, చేనేతలు, రైతులకు గిట్టుబాటు ధరలు దక్కేలా చర్యలు తీసుకోవాలి



- చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలెన్నో
- సాగు, తాగునీటి వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- వాడరేవులో ఫిషింగ్ హార్బర్, చేనేత పార్క్ ఏర్పాటు చేయాలి
- చేనేత ఉత్పత్తులు ఆప్కో కొనేలా చూడాలి
- అద్దంకిలో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయాలి

రైతులను ఆదుకోండి..

కారంచేడు: పర్చూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రధానంగా వ్యవసాయం రంగంపై ఆధారపడి ఉంది. ఈ రంగంలో పలు సమస్యలు అన్నదాతలను వెంటాడుతున్నాయి. ఈ ప్రాంత రైతులు ప్రధానంగా నాగార్జునసాగర్ ఆయకట్టు, కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద సుమారు 2 లక్షల ఎకరాల్లో వరి, ఇతర అపరాల సాగు చేస్తుంటారు. కాలువల ఆధునికీకరణ పనులు లేకపోవడంతో కట్టలు బలహీనంగా మారిపోయి తుఫాన్‌లు, వరదల సమయంలో కట్టలు తెగిపోయి పంటలు పూర్తిగా నష్టపోతున్నారు. ప్రస్తుతం ప్రధానంగా కొమ్మమూరు కాలువల కట్టలు పటిష్టపరచడం, మురుగు, వరదలు, డ్రైనేజీల ప్రవాహానికి అడ్డుగా ఉండే రొంపేరు కాలువల్లోని తూటు, గుర్రపుడెక్కలు తొలగించాలని కోరుతున్నారు. అలాగే గుంటూరు చానల్ పొడిగింపుపైన ప్రభుత్వం దృష్టి పెట్టాలని, అందుకు అవసరమైన నిధులు విడుదల చేసి గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేలా పనులు ప్రారంభించాలని ఈ ప్రాంత ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి నిధులు సాధించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

చేనేతలు, మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి

చీరాల: నియోజకవర్గంలో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం లేదు. రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేస్తే ప్రతి గ్రామానికి మంచినీటి సమస్య పరిష్కారం అవుతుంది. సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉన్న చిట్టివాద, దరివాదలకు కృష్ణా డెల్టా పరిధిలోని కొమ్మమూరు కాల్వ నుంచి సాగునీరు సక్రమంగా అందడం లేదు. ప్రస్తుతం స్టువర్టుపురం చానల్ నుండి సాగునీరు రావాలంటే చాలా సమస్యగా ఉంది. బెంజిమెన్ కాలువను తీయించి నేరుగా నీరందించాలని చీరాల రైతులు కోరుతున్నారు. వాడరేవులో ఫిషింగ్ హార్బర్ ప్రతిపాదనలో ఉంది. దానిపై ప్రత్యేక దృష్టిసారిస్తే తీరప్రాంత మత్స్యకారులకు అనేక రకాల మేలు జరుగుతుంది. మన ప్రాంత బోట్లు నిజాంపట్నం వరకు వెళ్లకుండా వాడరేవులోనే నిలుపుదల చేసుకునే అవకాశం ఉంటుంది. దీనికి వాడరేవు-పిడుగురాళ్ల నేషనల్ హైవే రోడ్డు ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతిపాదనలకే పరిమితమైన ఫైర్‌స్టేషన్ గేటు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిని పూర్తిచేయాలి. మురికి కూపంలా మారిన కుందేరు ఆక్రమణలను తొలగించి ఆధునీకరించాలి. చేనేతలు తయారు చేసిన వస్త్రాలను ఆప్కో కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం చర్చించి సుమారు నిల్వ ఉన్న రూ.50 కోట్ల విలువైన ఉత్పత్తులను కొనుగోలు చేయించాలి. నియోజకవర్గంలో చేనేత పార్కును ఏర్పాటు చేస్తే చేనేత కార్మికుల సమస్య తీరుతుంది. సహకార సంఘాలను బలోపేతం చేసి కార్మికులకు పని కల్పించాలి. బాపట్ల నుంచి రామాపురం వరకు టూరిస్ట్ హబ్‌గా ప్రకటించారు. రోడ్డు విస్తరించి టూరిజం శాఖ ఆధ్వర్యంలో రిసార్ట్‌లు, బోటింగ్‌లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తే చీరాల పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య దృష్టిపెట్టి అసెంబ్లీలో గళమెత్తి నిధులు సాధించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి మీదనే ఆశలన్నీ

అద్దంకి: నియోజకవర్గం ఏర్పడిన తరువాత తొలిసారిగా అద్దంకి నుంచి గెలిచిన గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నియోజకవర్గంలోని పలు సమస్యలు ఆయన శాసన సభలో ప్రస్తావించి పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు. అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల నుంచి ప్రకాశం జిల్లాలో కలపాలని, అద్దంకికి ఆర్డీవో కార్యాలయం తేవాలని, ఒక జాతీయ రహదారి, మరో జాతీయ రహదారి సమీపంలో ఉన్న అద్దంకిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల వైద్యశాల చేస్తూ, ఎముకల విభాగాన్ని ప్రవేశపెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా బాపట్ల జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వెనుక వైపునున్న భవనాశి చెరువును రిజర్వాయరుగా మార్చే పనులు పూర్తి చేయించి, 5 వేల ఎకరాలకు సాగు నీరు అందేలా చూడాలి. పర్యాటక కేంద్రంగా తీర్చిదాద్దాలని ప్రజలు కోరుకుంటున్నారు. ముఖ్యంగా కొరిశపాడు మండలంలోని కొరిశపాడులోని యర్రం చిన పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం, తమ్మవరం 2 ఎత్తిపోతల పథకం పనులు పూర్తికాలేదు. ఈ రెండు ఎత్తిపోతల పథకాలు పూర్తయితే 20 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆయా సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరుతున్నారు.

2011 చట్ట ప్రకారం కౌలు కార్డులు మంజూరు చేయాలి



2011 భూ ఆధారిత చట్టం ప్రకారం కౌలు రైతులకు అవసరమైన కౌలు కార్డులను సంబంధిత రైతుల అనుమతి అవసరం లేకుండా పంపిణీ చేయాలి. ఈ ప్రాంతంలో భూములను సాగు చేసేది 80 శాతం మంది కౌలు రైతులే ఉంటారు. వీరందరూ భూముల యజమానుల నుంచి అంగీకార పత్రం తీసుకురావాలంటే వీలవ్వని పరిస్థితులున్నాయి. కౌలు రైతు కార్డులు లేకపోడవంతో సాగు సమయంలో ప్రభుత్వం నుంచి అందించే రాయితీలు, నష్టపరిహారాలు అందక కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నాయకులు, ప్రభుత్వాలు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– పీ ఏడుకొండలు, కౌలు రైతు సంఘం నాయకులు, కారంచేడు

కొమ్మమూరు కాలువ, రొంపేరు కాలువలను ఆధునికీకరించాలి



ఈ ప్రాంత జీవనాడిగా ఉన్న కొమ్మమూరు కాలువతో పాటు, ఎగువ నుంచి దిగువకు వరద నీరు, మురుగునీరు ప్రవహించే రొంపేరు కాలువల ఆధునీకరణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి. తుఫాన్‌లు, విపరీతంగా వచ్చే వరదలతో కట్టలు చాలా ప్రాంతాల్లో బలహీనపడ్డాయి. కొన్ని చోట్ల కోతలకు కూడా గురయ్యాయి. వీటిని వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే వరదలు వచ్చినప్పుడు ఆ వరదంతా పంట పొలాలపై పడి రైతులు పంటలను ఏటా నష్టపోతున్నారు. పాలకులు, అధికారులు వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలి.

– పీ కొండయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు, కారంచేడు

ధాన్యం నిల్వలకు గోదాములు నిర్మించాలి



పర్చూరు నియోజకవర్గంలో అన్నదాతలు ప్రధానంగా వరిసాగు పైనే ఆధారపడి ఉన్నారు. ఏటా వచ్చిన దిగుబడులకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ధాన్యం నిల్వ చేసుకోవడానికి అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో ఎంతో మంది రైతులు గత్యంతరం లేక పురులు కట్టేవారు. అయితే వేసవిలో అవి అగ్ని ప్రమాదాలకు గురయ్యేవి. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతి మండలానికి ఒక యార్డ్ నిర్మిస్తామన్నారు. కానీ అవి అమలు కాలేదు. ఇప్పుడైనా అది అమలు చేసి మండలాల్లో యార్డ్‌లు లేదా గోదాముల నిర్మాణం చేపడితే అన్నదాలకు మేలు జరుగుతుంది.

– యార్లగడ్డ సుబ్బారావు, రైతు నాయకులు, కారంచేడు

ప్రజల పక్షాన పోరాడండి

- చీరాల మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లతో కరణం వెంకటేష్

చీరాల: పట్టణంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడాలని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ స్థానిక మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్ మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలపై కౌన్సిల్‌లో గళమెత్తాలన్నారు. పట్టణాభివృద్ధికి అందరూ ఏకతాటిపై నిలిచి పనిచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు గుంటూరు ప్రభాకరరావు, బత్తుల అనిల్, లలితా రాజశేఖర్, చీమకుర్తి బాలకృష్ణ, గోలి జగదీష్, తోకల అనిల్, కీర్తి వెంకట్రావు, గొట్టిపాటి ఎబినేజర్, కంపా అరుణ్, పార్టీ నాయకులు కోడూరి ప్రసాద్‌రెడ్డి, యాతం మేరిబాబు, యాతం సునీల్, గోలి రవికుమార్, మొగిలి బాబ్జి, మొహిద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరణం వెంకటేష్‌తో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

జరుబులవారిపాలెం (కారంచేడు): అధిక వర్షాల కారణంగా గ్రామాల్లో అపరిశుభ్రతకు తావులేకుండా పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జరుబులవారిపాలెం గ్రామ సర్పంచ్ మాదాసు కుమారి, కార్యదర్శి జయప్రకాష్ తెలిపారు. డీఎల్‌పీఓ ఆదేశాల మేరకు, వైద్య ఆరోగ్యశాఖ సూచనలతో గ్రామంలో ఎక్కడా చెత్తా, చెదారం నిల్వలు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గ్రామాల్లో విషజ్వరాలు, డెంగీ, టైఫాయిడ్ వంటి జ్వరాలు, డయేరియాలు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సోమవారం ప్రొక్లెయిన్‌తో పేరుకుపోయిన చెత్తను దూరంగా తీయించారు. గ్రామంలో డంపింగ్ యార్డు లేకపోవడం వలన ఇలాంటి సమస్యలు వస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.



జరుబులవారిపాలెంలో చెత్తను ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న దృశ్యం

లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలి

- జేఎన్‌టీయూ వీసీ మురళీకృష్ణ

వేటపాలెం: ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు ప్రాథమికంగానే లక్ష్యాన్ని ఎంచుకుని చదువుల్లో రాణించగలిగితే ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని కాకినాడ జేఎన్‌టీయూ వైస్ చాన్సిలర్ కేవీఎస్‌జీ మురళి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ మొదటి ఏడాది చేరిన విద్యార్థులు, తల్లిదండ్రులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థులకు కేటాయించిన వంద శాతం సీట్లు భర్తీ అవడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కళాశాలపై పెట్టుకున్న నమ్మకాన్ని ఆచరణలో పెట్టి మంచి ఫలితాలు సాధించే దిశగా వారికి బోధన చేయాలని సూచించారు. ప్రతి ఏడాది మెరుగైన విద్య అందించడానికి విద్యాసంస్థ కృషిచేయాలన్నారు. యూనివర్శిటీ పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. ఇంగ్లిష్ మాట్లాడటం తప్పనిసరిగా మొదటి ఏడాది నుంచే నేర్చుకోవాలని సూచించారు. అనంతరం వీసీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనామా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు, పూర్వ విద్యార్థి, పారిశ్రామికవేత్త దివి సాహిత, ఎస్.అమర్‌నాథ్, అక్రెడిటేషన్స్ డైరెక్టర్ సి.సుబ్బారావు, ప్రిన్సిపాల్ కె.జగదీష్‌బాబు, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ మురళీకృష్ణ

మోకాళ్లపై కూర్చుని టోల్‌గేట్ సిబ్బంది నిరసన

మార్టూరు: తమ డిమాండ్ల పరిష్కారానికి బొల్లాపల్లి టోల్‌గేట్ సిబ్బంది సోమవారం మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, క్యాంటీన్ ను పునరుద్ధరించాలని, సిబ్బందికి యూనిఫాం ఇవ్వాలని, బోనస్లు ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ టోల్‌గేట్ వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మజుందార్, ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు, టోల్ ప్లాజా యూనియన్ ఉపాధ్యక్షుడు ఇమ్మానియేలు, కార్యదర్శి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న టోల్‌గేట్ సిబ్బంది

తాగునీటి అవసరాలకే సాగర్ జలాలు



వల్లాపల్లి లాకుల వద్ద సాగర్‌నీరు ఉధృతి

బల్లికురవ: ప్రభుత్వం తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్‌జలాలను విడుదల చేసిందని తహసీల్దార్ యం. సుభద్ర సోమవారం తెలిపారు. అద్దంకి బ్రాంచ్ కాలువ బాపట్ల జిల్లా ఆరంభం 18/0 వద్దకు 850 క్యూసెక్కుల నీరు వస్తుందని చెప్పారు. 33/0 అద్దంకి మేజర్‌కాలువ వల్లాపల్లి లాకుల వరకు 650 క్యూసెక్కులు డిస్‌చార్జి అవుతుందన్నారు. ఎన్నెస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, సర్పంచ్‌లు సమన్వయంతో నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ చెరువులను పూర్తిస్థాయిలో సాగర్ జలాలతో నింపాలన్నారు. సాగర్‌నీరు దుర్వినియోగపరిచినా, పంటలకు వినియోగించినా చట్టపరంగా చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

ఘనంగా జాతీయ విద్యా విధాన దినోత్సవం



అభ్యసనా సామాగ్రిని పరిశీలిస్తున్న ఎంఈఓ

అద్దంకి: జాతీయ విద్యా విధానం దినోత్సవాన్ని మండలంలోని కట్టకిందపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామాగ్రి తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమానికి ఎంఈఓ బి.సుధాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అభ్యసనా సామాగ్రిని చక్కగా తయారు చేసిన ఉపాధ్యాయురాలు సందిరెడ్డి శ్యామలాదేవిని అభినందించారు. ఈ నెల 28 వరకు మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీ బి.బి.పుణ్యవతి పాల్గొన్నారు.

‘టీఎల్‌ఎం’తో సులభతర విద్యా బోధనలు

కుంకలమర్రు (కారంచేడు): టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సులభతర విద్యా బోధనలు జరుగుతున్నాయని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ గ్రామాల్లో జరుగుతున్న టీఎల్‌ఎం బోధనలను సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలను వారు పరిశీలించారు. కుంకలమర్రు సీసీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన బొమ్మలు చూపరులు ఆకర్షించేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్యామల, పీ నాగమణి, వీ బాబూరావు, గాంధీనగర్‌లో డీ రాజేశ్వరి, మొయిన్‌లో పావులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కుంకలమర్రులో టీఎల్‌ఎం ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అలుపెరగని కార్మిక నాయకుడు.. గంగయ్య

చీరాల అర్బన్: అలుపెరగని కార్మిక నాయకుడు గంగయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. చీరాల సీపీఎం సీనియర్ నాయకుడు గుండూరి గంగయ్య వర్ధంతి సభను సోమవారం స్థానిక ఆయన నివాసంలో నిర్వహించారు. గుండూరి గంగయ్య పోస్టల్ ఉద్యోగిగా ఉద్యమానికి పరిచయమై సీఐటీయూ నాయకుడిగా, సీపీఎం కార్యకర్తగా పనిచేశారన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత పెన్షనర్ల సమస్యలపై చివరి వరకు ఉద్యమాలు చేసి ప్రజలకు సేవలందించారన్నారు. ఆయన మరణం ఉద్యమానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమానికి ఎం.వసంతరావు అధ్యక్షత వహించగా, పట్టణ కార్యదర్శి ఎన్.బాబూరావు, పీ కొండయ్య, డి.నారపరెడ్డి, ఐవీ ప్రసాద్, సీఐటీయూ నాయకులు బి.సుబ్బారావు, బి.శ్రీనివాసరావు, కె.యోహాను, ఆర్‌వీఎస్ రామిరెడ్డి, బి.పోతురాజు, సుధీర్, ప్రజానాట్యమండలి నాయకులు భగవాన్‌దాస్, సుబ్బారావు, కిరణ్ పాల్గొన్నారు.

బోధనోపకరణాల ప్రదర్శన

చీరాల అర్బన్: కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.సాల్మన్‌రాజ్ తెలిపారు. ప్రారంభ రోజు బోధనోపకరణాల ప్రదర్శన నిర్వహించారు. వారం రోజుల పాటు రోజుకో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. నూతన విద్యా విధానం అమల్లోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హృద్రోగికి హెల్పింగ్ హాండ్స్ ఆర్థిక సహాయం

మార్టూరు: గుండె జబ్బుతో బాధపడుతున్న ఓ పేదవానికి మార్టూరుకు చెందిన హెల్పింగ్ హాండ్స్ సంస్థ సోమవారం ఆర్థిక సహాయం అందజేసింది. స్థానిక గొట్టిపాటి హనుమంతరావు కాలనీకిచెందిన షేక్ వలి అలియాస్ చుట్టమేస్త్రి గుండె నాలుగు వాల్స్ మూసుకుపోయి మంచానికే పరిమితమైపోగా వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. విషయం తెలిసిన హెల్పింగ్ హాండ్స్ సంస్థ ప్రతినిధులు వలి నివాసానికి వెళ్లి రూ.5 వేల నగదుతో పాటు 25 కిలోల బియ్యం వలి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సంస్థ ప్రతినిధులు పఠాన్ ఖాదర్ వలీ, గుర్రం శ్రీనివాసరావు, సలీం, రహిమ, హబీబా, ఖాసిం కాలేషా తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా కోటిలింగాచారి

అద్దంకి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్ అసోసియేషన్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పట్టణానికి చెందిన కోటలింగాచారిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రంగబాబు, ప్రధాన కార్యదర్శి పెదపూడి నరసింహమూర్తి సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు కార్పెంటర్స్ అసోసియేషన్ భవనంలో జిల్లా అధ్యక్షుడు చల్లా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జిలానీబాష, కోశాధికారి కృష్ణమోహన్ చేతుల మీదుగా సోమవారం ఒంగోలులో నియామక ఉత్తర్వులు అందుకున్నారు. సమావేశంలో అద్దంకి కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడి చెన్నకేశవులు, గౌరవ సలహాదారులు పొన్నపల్లి మల్లికార్జున, ఏజెంట్లు ఆంజనేయులు, సెక్రటరీ నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఆళ్లగడ్డ వీర సుందరాచారి, మచ్చ సుబ్బారావు, మల్లవరపు మస్తాన్, టి రవీంద్ర, మహబూబ్ బాషా, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



కోటిలింగాచారిని సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వెంకటేశ్వర్లు

బల్లికురవ: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సర్పంచులు, సెక్రటరీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. ఈనెల 6న సాక్షిలో ‘పడకేసిన పారిశుధ్యం –మంచంపట్టిన పల్లెలు’ అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అధికారుల బృందం సోమవారం పెదఅంబడిపూడి గ్రామాన్ని పరిశీలించి జ్వరపీడితులతో మాట్లాడారు. గ్రామపంచాయతీ అధికారులు కొంతమేరకు స్పందించారు. పెద అంబడిపూడి, చిన అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం గ్రామాల్లో సైడు కాలువలోని మురుగు తొలగించారు. సీజనల్ జ్వరాలను అదుపులోకి తెచ్చేందుకు క్యాంపులు నిర్వహించారు. పెద అంబడిపూడిలో జ్వరాల పూర్తిస్థాయిలో అదుపులోకి రానందున డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయమ్మ ఆదేశాలమేరకు డీఐవో వెంకటేశ్వర్లు, ఎపిడమిక్ టీమ్ నాగేశ్వరరావు, రవి పెదఅంబడిపూడిలో జ్వరపీడితులతో మాట్లాడారు. ఎస్సీ, బీసీ కాలనీలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని, మురుగు నిల్వలతోనే వ్యాధులు ప్రబలుతున్నాయని వెంకటేశ్వర్లు సర్పంచ్ ఎం కుసుమకుమారి, సెక్రటరీ కెవీ అనిల్‌కుమార్‌కు తెలియజేశారు. ట్రాక్టర్ ద్వారా వీధుల్లో ఎబేట్ పిచికారీ చేయించారు. గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్, కె.రవితేజ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కేవీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



జ్వరపీడితులతో మాట్లాడుతున్న అధికారులు